ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత విమర్శలుగా మాత్రమే కాకుండా తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య కొనసాగుతున్న రాజకీయ ఆధిపత్య పోరులో మరో పరిణామంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రేవంత్ రెడ్డి ఇప్పుడు జాతీయ రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగా మారుతున్న నేపథ్యంలో బీజేపీ ఆయనపై విమర్శల తీవ్రత పెంచడం ఆసక్తికరంగా మారింది. కిషన్ రెడ్డి విమర్శల్లో ప్రధానంగా కనిపిస్తున్న అంశం రేవంత్ రెడ్డి రాజకీయ ఆకాంక్ష. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న నాయకుడు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ హామీల అమలుపై దృష్టి పెట్టాల్సి ఉంటుందని బీజేపీ వాదిస్తోంది. కానీ రేవంత్ రెడ్డి మాత్రం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలనే లక్ష్యంతో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించడం, రాజకీయంగా తన ఇమేజ్‌ను విస్తరించుకోవడం కోసమే ఆయన ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. అయితే రేవంత్ రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే, రాష్ట్ర రాజకీయాల్లో దూకుడైన నాయకుడిగా ఎదిగిన ఆయన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తూనే జాతీయ రాజకీయ అంశాలపై కూడా స్పందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన వ్యాఖ్యలను రాజకీయ ప్రచారంగా బీజేపీ అభివర్ణిస్తుండగా, కాంగ్రెస్ మాత్రం రాష్ట్ర ప్రయోజనాలు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై తమ అభిప్రాయాలను వెల్లడించే హక్కు తమకు ఉందని సమర్థించుకునే అవకాశం ఉంది. దీంతో నాయకుల మాటల వెనుక ఉన్న రాజకీయ వ్యూహాలపై చర్చ మొదలైంది. ఇక కిషన్ రెడ్డి తన విమర్శలను రేవంత్ రెడ్డికే పరిమితం చేయలేదు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీకి దేశ సంక్షేమం కంటే ప్రధానమంత్రి పదవిపైనే ఆసక్తి ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ కలిసి దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని, విదేశీ శక్తులతో చేతులు కలిపి కేంద్ర ప్రభుత్వాన్ని




కూల్చివేయాలని చూస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో అశాంతిని సృష్టించడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. అయితే ఇవన్నీ కిషన్ రెడ్డి చేసిన రాజకీయ ఆరోపణలే తప్ప, ఆయన సమావేశంలో వెల్లడించిన అంశాలు స్వతంత్రంగా నిర్ధారణ అయిన వాస్తవాలుగా పరిగణించలేం. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. కాంగ్రెస్, బీజేపీ మధ్య పోరాటం ఇప్పుడు కేవలం ఎన్నికలు, ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి అంశాలకే పరిమితం కావడం లేదు. ఒకరిపై మరొకరు దేశ రాజకీయాలకు ముప్పుగా చిత్రీకరించుకునే స్థాయికి విమర్శలు చేరుతున్నాయి. ముఖ్యంగా రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుండగా, బీజేపీ నేతలు ఆయన రాజకీయ లక్ష్యాలనే ప్రశ్నిస్తూ ఎదురుదాడి చేస్తున్నారు. ఈ పరిణామాలు దేశవ్యాప్తంగా రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో స్థిరమైన, పటిష్టమైన పాలన కొనసాగుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు ప్రజలే సమాధానం చెబుతారని బీజేపీ నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న రాజకీయ విధానాలు, రాహుల్ గాంధీ వ్యాఖ్యలు, కేంద్ర ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను ప్రజల ముందు ఎండగడతామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాల్లో విస్తృతంగా పాదయాత్రలు నిర్వహించి ప్రజలకు కాంగ్రెస్ రాజకీయాల గురించి వివరిస్తామని ప్రకటించారు. అంటే బీజేపీ ఇప్పుడు కేవలం మీడియా సమావేశాలు, రాజకీయ ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలతో నేరుగా మమేకమయ్యే కార్యాచరణకు సిద్ధమవుతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. పాదయాత్రల ద్వారా ప్రజల్లోకి వెళ్లడం వల్ల పార్టీకి రాజకీయంగా ఎంతవరకు ప్రయోజనం కలుగుతుందనేది వాటి అమలు, ప్రజల స్పందనపై ఆధారపడి ఉంటుంది. అయితే కిషన్ రెడ్డి ప్రకటనతో కాంగ్రెస్‌పై బీజేపీ రాజకీయ పోరాటాన్ని మరింత విస్తరించాలనే సంకేతం స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధానికి తెరలేపాయి. ఒకవైపు రేవంత్ రెడ్డి రాష్ట్ర నాయకత్వాన్ని జాతీయ స్థాయిలోనూ చర్చకు తీసుకెళ్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తుంటే, మరోవైపు అదే ప్రయత్నాలను బీజేపీ ప్రచార ఆరాటంగా అభివర్ణిస్తోంది. రాహుల్ గాంధీపై కిషన్ రెడ్డి చేసిన విమర్శలు కూడా ఈ రాజకీయ పోరాటానికి జాతీయ కోణాన్ని జోడిస్తున్నాయి. అయితే ఈ విమర్శల మధ్య ప్రజలు గమనించాల్సిన అసలు అంశం నాయకుల రాజకీయ ఆకాంక్షలు మాత్రమే కాదు.. రాష్ట్రానికి ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలవుతున్నాయి, కేంద్రం నుంచి తెలంగాణకు అందుతున్న సహకారం ఏమిటి, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ఏంటి అనేదే. రాజకీయ నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతూనే ఉంటాయి. కానీ వాటికి ప్రజల నుంచి వచ్చే స్పందన మాత్రం పాలన, పనితీరు, అభివృద్ధి ఆధారంగానే ఉంటుంది. రేవంత్ రెడ్డి జాతీయ నాయకుడిగా ఎదగాలనే ప్రయత్నాలపై కిషన్ రెడ్డి చేసిన విమర్శలు రాబోయే రోజుల్లో మరింత రాజకీయ చర్చకు దారితీసే అవకాశం ఉంది. బీజేపీ ప్రకటించిన పాదయాత్రలు ఎలాంటి ప్రభావం చూపిస్తాయి, కాంగ్రెస్ ఈ విమర్శలకు ఎలా బదులిస్తుంది, ఈ పోరాటం తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది అనేవి రాబోయే పరిణామాల్లో కీలకంగా మారనున్నాయి.

మహిళా వ్యాపారులకు సహకారం: సీతక్క

హైదరాబాద్:

మహిళా పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు పెట్టుబడులు, మార్కెట్లు, కార్పొరేట్ భాగస్వామ్యాలను అందుబాటులోకి తేనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (డబ్ల్యూఈఈసీ)ను ఏర్పాటు చేసిందని తెలిపారు. మంత్రి సీతక్క అధ్యక్షతన, వీహబ్ సీఈవో సీత పల్లచోళ్ల కన్వీనర్‌గా ఈ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 నేపథ్యంలో సోమవారం సచివాలయంలో కౌన్సిల్ తొలి సమావేశం జరిగింది. ఈ కౌన్సిల్‌లో విధాన నిర్ణేతలు, మహిళా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలు, విధానపరమైన సహకారం కల్పించేందుకు ఈ కౌన్సిల్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. మహిళా వ్యాపారవేత్తలకు పెట్టుబడులు, వినియోగదారులు, మార్కెట్ నెట్‌వర్క్‌లే ప్రధాన సవాళ్లు అని సీత పల్లచోళ్ల తెలిపారు.



GENERAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

బిల్లులు రాక మిషన్ భగీరథ కాంట్రాక్టర్ల గగ్గోలు

- బిల్లుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు..?
- కాంట్రాక్టర్లకు పెరుగుతున్న అప్పులు, వడ్డీలు
- ప్రజల దాహం తీర్చినందుకు మిగిలింది ఆర్థిక కష్టాలేనా అంటున్న వైనం ?
- ఎవరికి చెప్పుకోలేని దీన పరిస్థితిలో కాంట్రాక్టర్లు



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఇంటింటికీ నల్లా నీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ఆర్థిక కష్టాలను మిగిల్చిందని జిల్లాలోని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల దాహం తీర్చేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి పనులు పూర్తి చేసినా, అందుకు రావాల్సిన బిల్లులు మాత్రం మూడేళ్లుగా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లకు రావలసిన కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో అప్పుల భారం పెరిగి, వడ్డీలు కట్టలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వారు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఆర్థిక సమస్యలు, మరోవైపు కుటుంబ బాధ్యతల తో పాటు ఇంకోవైపు అప్పులిచ్చిన వారి ఒత్తిడితో మానసిక ప్రశాంతత కరువైందని మిషన్ భగీరథ కాంట్రాక్టర్లు వాపోతున్నాడు.

అప్పులు తెచ్చి పనులు చేసినా ఫలితం లేకపాయే !

కష్టపడి పనిచేస్తే నాలుగు రాళ్లు మిగులుతాయి అన్న ఆశతో అప్పులు చేసి పనులు పూర్తి చేసిన ఫలితం లేకుండా పోయిందని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పనులు చేపట్టే కాంట్రాక్టర్లు ముందుగా వారు సొంతంగా పెట్టుబడులు పెట్టడం, అవసరమైతే అప్పులు తీసుకురావడం సాధారణంగా జరుగుతుంటాయి. అయితే పనులు పూర్తయిన తర్వాత బిల్లులు వస్తాయనే నమ్మకంతోనే ఆర్థికంగా భారమైన అప్పటికి పనులను సైతం చేపడుతుంటారు. పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు అందకపోవడంతో అప్పులు తీర్చలేక, తీసుకున్న అప్పులకు నెలనెలా వడ్డీలు చెల్లించాల్సి రావడంతో తమపై ఆర్థిక భారం అంతకంతకూ పెరుగుతోందని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యంపై ప్రభావం.. కుటుంబంపై భారం :

బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరగడం, ఎప్పుడు విడుదలవుతాయో తెలియని పరిస్థితి నెలకొందని మిషన్ భగీరథ పనులు చేసిన కాంట్రాక్టర్లు అంటున్నారు. పనులు పూర్తి చేసేందుకు చేసిన అప్పుల వారి నుండి వస్తున్న ఒత్తిడి తమను మానసికంగా కుంగదీస్తున్నాయని వాపోతున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ వడ్డీలు పెరుగుతుండగా, మరోవైపు ఆరోగ్యం కూడా క్షీణిస్తోందని ఆవేదన చెందుతున్నారు. కుటుంబ పోషణ, పిల్లల భవిష్యత్తు, ఆర్థిక బాధ్యతల మధ్య సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు తాగునీరు అందించేందుకు చేసిన పనులే తమ కుటుంబాలకి కన్నీళ్లు మిగిల్చాయని బాధపడుతున్నారు.

తమకు రావాల్సిన బిల్లులపై ప్రభుత్వం స్పందించేదెప్పుడు? :

ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో భాగస్వాములై ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించడం ప్రభుత్వ బాధ్యత అని ప్రభుత్వం స్పందించేది ఎప్పుడు అని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంచితే కాంట్రాక్టర్లు ఆర్థికంగా ఎలా నిలదొక్కుకుంటారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పెండింగ్ బిల్లులపై సమగ్ర పరిశీలన జరిపి, అర్హత మేరకు నిధులు విడుదల చేయాలని జిల్లాలోని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.


పట్టభద్రుల ఓటరు నమోదుకు బీఆర్ఎస్ నేత బాదావత్ సురేష్ పిలుపు

- నవంబర్ 6తో ముగియనున్న గడువు
- అర్హులైన ప్రతి పట్టభద్రుడు వెంటనే నమోదు చేసుకోవాలి



చిన్నగూడూర్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేందుకు చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియకు నవంబర్ 6వ తేదీతో గడువు ముగియనుండటంతో అర్హులైన పట్టభద్రులందరూ తక్షణమే తమ పేర్లను నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు, చిన్నగూడూరు మండల సోషల్ మీడియా అధ్యక్షుడు బాదావత్ సురేష్ పిలుపునిచ్చారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో చిన్నగూడూరు మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. గడువు ముగిసిన తర్వాత అవకాశం కోల్పోయే పరిస్థితి రాకుండా ముందుగానే అప్రమత్తం కావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాదని, ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించే కీలకమైన ఆయుధమని బాదావత్ సురేష్ పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగస్వామి కావాలంటే ముందుగా ఓటరుగా నమోదు కావడం అత్యవసరమన్నారు. నవంబర్ 6 చివరి గడువు కావడంతో ఒక్క పట్టభద్రుడు కూడా ఓటరు నమోదుకు దూరం కాకూడదని, అర్హులందరూ తక్షణమే స్పందించి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బాదావత్ సురేష్ విజ్ఞప్తి చేశారు.

బాణా సంచా దుకాణాలను తొలగించాలని వినతి



తిరుమలగిరి, విశాలభారతి : తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద సూర్యాపేట, జనగాం, తొర్రూరు, వలిగొండ రోడ్డు పక్కన నెలకొల్పిన బాణాసంచా ఇప్పుడే కేంద్రాలను తొలగించాలని కోరుతూ సోమవారం నాడు తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం అధికారి ఎంపీడీవోకు సీనియర్ జర్నలిస్టులు బి వెంకటేశ్వర్లు, ఎస్ కే చాంద్ పాషా వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జనసంచారం ఉన్నచోట బానసంచాలు విక్రయించవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ ఎలాంటి అనుమతులు లేకుండా జనసంచారం తో పాటు బస్సులు నిలిపే చోట విక్రయించడం మూలంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే హోల్సేల్ విక్రయ కేంద్రాలు కూడా జన సంచారం ఉండే చోటనే నెలకొల్పారని వారన్నారు.వీరికి జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ తో పాటు రెవిన్యూ ,మున్సిపల్ పోలీస్ , ఫైర్ అధికారుల అనుమతి ఉంటేనే విక్రయించాలని,అలాగే జన సంచారం లేని చోట ఈ షాపులు నెలకొల్పాలని వారుకోరారు.బాణసంచా దుకాణ యజమానులు అవన్నీ పట్టించుకోకుండా నిబంధనలకువిరుద్ధంగా జన సంచారం ఉన్న చోటనే షాపులు నెలకొల్పి విక్రయిస్తున్నారని వారు తెలిపారు.వీరిపై చర్య తీసుకోవాలని కోరారు.

ఓటరు నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే యశస్విని



దేవరుప్పుల విశాలభారతి : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియకు నవంబర్ 6 చివరి తేదీ కావడంతో పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,యువజన కాంగ్రెస్, నాయకులు ఓటరు నమోదు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి విజ్ఞప్తి చేశారు.నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం,ప్రతీ మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి,వీలైనంత ఎక్కువ మందిని ఓటర్లుగా నమోదు చేయించేలా నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పట్టభద్రుల ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేలా వారికి అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదు ప్రక్రియలో ఎవరూ వెనుకబడిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.ఓటరు నమోదు కోసం గడువు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, అర్హులైన పట్టభద్రులందరూ నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకునేలా కృషి చేయాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పిలుపునిచ్చారు.

అండగా సుందర్ చారిటబుల్ ట్రస్ట్

- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరగోని బాలరాజుకు పరామర్శ
- వీల్‌చైర్ అందజేత
- సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్



దేవరుప్పుల, విశాలభారతి: ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, అవసరమైన వారికి చేయూతనందించడమే లక్ష్యంగా సుందర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకులు ఏల సుందర్ మరోసారి తన సేవా నిరతిని చాటుకున్నారు. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరగోని బాలరాజు కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు కిందపడటంతో కాలు ఫ్రాక్చర్ అయి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఏల సుందర్ సోమవారం బాలరాజు నివాసానికి వెళ్లి ఆయనను ఆప్యాయంగా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో బాలరాజు అవసరాన్ని గుర్తించి, ఆయన కోరిక మేరకు వీల్‌చైర్‌ను (తోపుడు బండిని) అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు కుటుంబ సభ్యులు ఏల సుందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సుందర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు ఎంతోమందికి ఉపయోగపడుతున్నాయని, ఆపద సమయంలో అండగా నిలుస్తూ బాధితులకు అవసరమైన సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు చిలుపురం సోమయ్య, నాయకులు ఇంద్రసేన రెడ్డి, తోటకూరి కిష్టయ్య, గొడిశాల మల్లేష్, కారుపోతుల సారంగపాణి, ఉప్పల సామ్రాట్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దస్రు నాయక్ సేవలు కాంగ్రెస్ మరువదు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి



మోతె , విశాలభారతి: దస్రు నాయక్ సేవలు కాంగ్రెస్ పార్టీ ఏనాడు మరువ బోదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అన్నారు సోమవారం మండల పరిధిలోని రాందాస్ తండలో ఇటీవల మరణించిన స్వర్గీయ భూక్య దస్రు విగ్రహ ఆవిష్కరణ చేసిన అనంతరం అయన మాట్లాడుతూ దస్రు మండలం లొ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమం లొ చురుకుగా పాల్గొని పార్టీని బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయడం అభినందనియం మన్నారు కుటుంబాన్ని క్రమ శిక్షణ తొ నడిపించాడని దస్రు లేని లోటు పార్టీకి కుటుంబానికి తీరని లోటని చెప్పారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల గురుకృష్ణ,గ్రామ సర్పంచ్ భూక్య ఉప్పయ్య , ఉప సర్పంచ్ భూక్య నరేష్, వార్డు సభ్యులు భూక్య హుస్సేన్ రాములు శంకర్ మిక్కిలినేని రాము , ధరావత్ నాగు , రవి , భుక్య మధు , టింకు బాబు వివిధ గ్రామాల సర్పంచ్ లు , నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హోదా ఎంత ఎత్తులో ఉన్నా.. అడుగులు మాత్రం సామాన్యుల మధ్యే!

- హంగూ ఆర్భాటాలకు దూరంగా..
- రోడ్డు పక్కన కూరగాయల కొనుగోలులో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్.



మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; రాజకీయాల్లో పదవులు, అధికారాలు ఒకవైపు..ప్రజల మధ్య కలిసిమెలిసి ఉండే సాధారణ జీవనశైలి మరోవైపు. ఈ రెండింటి మధ్య తనదైన రీతిలో కనిపించారు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్. మహబూబాబాద్ పట్టణంలో ఎలాంటి హంగూ ఆర్భాటాలు, ప్రత్యేక ఏర్పాట్లు లేకుండా సాధారణ మహిళల మధ్యకు వెళ్లి రోడ్డు పక్కన కూరగాయలు కొనుగోలు చేశారు. మాజీ మంత్రి హోదాలో ఉన్నప్పటికీ ప్రత్యేకతను ప్రదర్శించకుండా, తన చుట్టూ ఎలాంటి హడావుడి లేకుండా సామాన్య మహిళల్లో ఒకరిగా కలిసిపోయారు. మార్కెట్‌లో సాధారణంగా కూరగాయలు కొనుగోలు చేస్తూ కనిపించిన ఆమె తీరు అక్కడి వారిని ఆకట్టుకుంది. పదవులు ఉన్నత స్థానాన్ని అందించవచ్చు..కానీ ప్రజల మధ్య సహజంగా మెలగడం వ్యక్తిత్వాన్ని చాటుతుందనేలా ఈ దృశ్యం నిలిచింది. ఆర్భాటాల కంటే ఆత్మీయతకు, ప్రచార హడావుడి కంటే సహజత్వానికి ప్రాధాన్యతనిచ్చిన ఈ సందర్భం మహబూబాబాద్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హోదా మాజీ మంత్రిదైనా.. హడావుడి లేని సామాన్య జీవనం! మహిళల మధ్య కూరగాయలు కొనుగోలు చేస్తున్న సత్యవతి రాథోడ్.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలతో భూ సర్వే





- రెవెన్యూ ఫారెస్ట్ సంయుక్త సర్వే
- ఆ భూమి మాదే అంటున్న ఫారెస్ట్ అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలంలోని రాయినిపేట రైల్వే స్టేషన్ సమీపంలో గల సర్వేనెంబర్ 79 భూములను సోమవారం రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సంయుక్తంగా ఆధునిక సాంకేతిక పరికరాలతో సర్వేలు చేపట్టారు. ఈ సర్వే నెంబర్ లోని భూమి తనదేనని ఫారెస్ట్ అధికారులు తన భూమిని ఆక్రమించుకున్నారని మండల పరిధిలోని కళ్యాణపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎస్సీ ఎస్టీ కమిషన్ ను ఆశ్రయించాడని, కమిషన్ ఆదేశాల అనుసారంతో ఈ భూములను సర్వే చేస్తున్నట్లు ఆ శాఖల అధికారులు తెలిపారు.


భూములు ఎవరివన్నవి తేల్చేందుకే సర్వే : తహసిల్దార్ సూర్యప్రకాష్.

సర్వేనెంబర్ 79 లోని భూములు ఫారెస్ట్ వా లేక రెవిన్యూ భూముల అన్న విషయాన్ని తేట తెల్లం చేసేందుకే సర్వేలు నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ సూర్యప్రకాష్ తెలిపాడు. అదేవిధంగా ఆ భూమి తనదేనని కళ్యాణపురానికి చెందిన వ్యక్తి ఎస్సీ, ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. కమిషన్ ఆదేశాల అనుసారం భూమి ఎవరిది అన్నది పూర్తి ఆధారాలు తెలుసుకునేందుకు సర్వేలు చేస్తున్నట్లు తెలిపారు. సర్వే అనంతరం తదుపరి నివేదికలు అందజేస్తామన్నారు.

సర్వే నెంబర్ 79 లోగల 47 ఎకరాల భూమి ఫారెస్ట్ గెజిట్లో ఉంది : డి ఆర్ ఓ ధనలక్ష్మి

సర్వే నెంబర్ 79 లోని భూమి 47 ఎకరాలు తమ ఫారెస్ట్ దేనని అశ్వాపురం ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (డిఆర్ఓ) ధనలక్ష్మి తెలిపారు. రాయిని పేట రైల్వే స్టేషన్ సమీపంలో మొత్తం 47 ఎకరాల భూమి ఫారెస్ట్ గెజిట్లో ఉందని, అది ఫారెస్ట్కు సంబంధించిందేనన్నారు. ఫారెస్ట్ భూములను ఆక్రమణలకు గురిచేయాలని చూస్తే ఊరుకోమన్నారు. అందుకే రెవిన్యూ అధికారులతో కలసి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. అది ముమ్మాటికి ఫారెస్ట్ భూమిని, తమ భూమిలో ఎప్పటి నుండో పర్మినెంట్ బౌండరీలు కూడా నిర్మాణం చేసి ఉన్నాయన్నారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆర్ఓఎఫ్ ఆర్ ద్వారా పట్టాలు పొందిన వారి భూముల జోలికి తామెల్లమన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో ఆర్ఐ లీలావతి, మండల సర్వేయర్ ఇర్పా ప్రవీణ్, అమ్మగారిపల్లి ఇన్చార్జి ఎఫ్ బి ఓ కే. సంధ్య పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల భారీ తరలింపు



రాజేంద్రనగర్, విశాలభారతి : ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం - అరాచకాన్ని తరిమికొడదాం అనే నినాదంతో హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పాదయాత్రకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లాయి. నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలు, మున్సిపాలిటీలు, డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాటేదాన్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద మహా పాదయాత్రకు బయలుదేరే కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. పార్టీ జెండా ఊపి నాయకులు, కార్యకర్తల వాహన శ్రేణిని ఆయన ప్రారంభించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఘనస్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా హైదరాబాద్‌కు బయలుదేరాయి. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, రాజ్యాంగబద్ధమైన సంస్థలను పరిరక్షించడం భారతీయ జనతా పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పార్టీ నిరంతరం పోరాటం సాగిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, వివిధ మండలాలు, మున్సిపాలిటీల నాయకులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, భారతీయ జనతా యువమోర్చా నాయకులు, కార్యకర్తలు, యువకులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాటేదాన్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ తరలింపు కార్యక్రమం బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ముందుకు సాగడం ఈ కార్యక్రమంలో స్పష్టంగా కనిపించింది.

నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

- ఆరు లీటర్ల సారా స్వాధీనం
- ఓ మహిళపై కేసు నమోదు.. నలుగురికి బైండోవర్



బయ్యారం విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: మండలంలో నాటుసారా తయారీ, విక్రయాల నియంత్రణే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించారు. సోమవారం బయ్యారం మండలంలోని సంతులపోడు తండా, కోటగడ్డ, కొత్తపేట గ్రామాల్లో చేపట్టిన తనిఖీల్లో ఓ మహిళ నాటుసారాతో పట్టుబడింది. ఆమె వద్ద నుంచి ఆరు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్న అధికారులు కేసు నమోదు చేశారు. నాటుసారా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ముమ్మరం చేసిన ఎక్సైజ్ అధికారులు, గతంలో నాటుసారా కేసుల్లో పట్టుబడిన మరో నలుగురు వ్యక్తులను గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాల తహసీల్దార్ల ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతర తనిఖీలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ హెచ్చరించారు. అక్రమ మద్యం కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ లలితారాణి, కానిస్టేబుళ్లు హరీశ్, రియాజ్, బలరాం పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై సత్యవతి రాథోడ్ సమీక్ష

- ఎన్రోల్మెంట్ బాధ్యులకు దిశానిర్దేశం..
- లక్ష్య సాధనకు సమన్వయంతో పనిచేయాలని సూచన.



మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; వరంగల్-నల్గొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని మాజీ మంత్రి, మహబూబాబాద్ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇన్‌చార్జ్ సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ నివాసంలో సోమవారం ఎన్రోల్మెంట్ బాధ్యులతో ఆమె ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు పూర్తయిన ఓటరు నమోదు వివరాలు, ఇంకా నమోదు కావాల్సిన పట్టభద్రుల సంఖ్య, మిగిలి ఉన్న సమయంపై సమీక్షించారు.సమయం తక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతతో పనిచేయాలని, అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎన్రోల్మెంట్ బాధ్యులంతా సమన్వయంతో పనిచేస్తూ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎండీ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం ఆక్రమించాడని మహిళ ఆవేదన

- ప్రజావాణిలో ఫిర్యాదు




అశ్వాపురం, విశాల భారతి : తన ఇంటి స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకొని తనకు తీవ్రమైన అన్యాయం చేశాడని నిద్దగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేస్తుంది. సోమవారం ప్రజావాణిలో ఆమె స్థలాన్ని ఆక్రమించిన సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మిట్టగూడెం గ్రామానికి చెందిన బేవర్ శ్రీదేవి అనే మహిళ 1986లో అశ్వాపురం మండలంలోని జగ్గారం క్రాస్ రోడ్డు సమీపంలో పుట్టి సవరయ్య అనే వ్యక్తి వద్ద ఐదుకుంటల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపింది. అయితే ఆమె ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో పాటు భర్త కూడా మృతి చెందడంతో ఆమెకున్న ముగ్గురు పిల్లలను పోషించుకునే క్రమంలో అక్కడ ఇంటి నిర్మాణాన్ని చేపట్ట లేకపోయింది. అయితే ఆ స్థలంలో తాత్కాలికంగా రేకుల షెడ్ చేసినప్పటికీ సదర్ వ్యక్తి దాన్ని తొలగించి ఆక్రమించాడని ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఆక్రమించిన వ్యక్తితో ఆమెకు పోరాడే శక్తి లేక తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని తనకు ఎక్కడ ఇల్లు నిర్మాణానికి స్థలం లేదని కనీసం రెండు కుంటల స్థలమైన తలదాచుకునేందుకు ఇవ్వాలని సదరు వ్యక్తిని ప్రాధేయపడినప్పటికీ డబ్బులు ఇస్తే తప్ప దాన్ని వదిలే ప్రసక్తే లేదని ఆక్రమించుకు కూర్చున్నాడని కన్నీరు మున్నీరయింది. నిరుపేదనైన తనకు తన స్థలాన్ని ఇప్పించి ఆదుకోవాలని వేడుకుంటుంది.

నాగోల్‌లో ఇద్దరు బాలురు అదృశ్యం

- ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

చెరువులోనూ గాలించేందుకు DRF బృందం సిద్ధం



విశాల భారతి, ఎల్బీనగర్ : నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. సాయిరాం నగర్ కాలనీ, రోడ్ నంబర్ 3కు చెందిన మొగిలి శిరీష కుమారులు వరుణ్ తేజ్ (8), మహేష్ (6) కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి, చిన్నారుల ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. వరుణ్ తేజ్, మహేష్‌నాగోల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. అక్టోబర్ 31న తల్లి పనికి వెళ్లి రాత్రి 9.30 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇద్దరు పిల్లలు కనిపించలేదు. తొలుత పాఠశాలకు వెళ్లి ఉంటారని భావించిన ఆమె, అక్కడ విచారించగా ఆ రోజు పిల్లలు పాఠశాలకు రాలేదని తెలిసింది. దీంతో ఆందోళనకు గురైన ఆమె పోలీసులను ఆశ్రయించింది. చిన్నారుల ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ తెలిపారు. చిన్నారులు సమీపంలోని సాయిరాం నగర్ చెరువు వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చెరువులోకి వెళ్లి ఉంటారా అనే అనుమానంతో ఆ కోణంలోనూ విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు. అవసరమైన చర్యల్లో భాగంగా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (DRF) బృందం సహాయంతో చెరువులో గాలింపు చేపట్టనున్నట్లు తెలిపారు. చిన్నారులు ఎక్కడికి వెళ్లారు, అదృశ్యం వెనుక ఏవైనా ఇతర కారణాలు ఉన్నాయా అనే అంశాలపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వరుణ్ తేజ్, మహేష్ ఆచూకీ తెలిసిన వారు నాగోల్ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

గంగపుత్ర జయంతి ఉత్సవాలకు ఆహ్వానం

-రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యకు ఆహ్వాన పత్రిక అందజేత



విశాలభారతి, హైదరాబాద్: గంగపుత్ర జాతిపిత, మత్స్యకార మహాత్మ ఆచార్య సందిరి బాలయ్య గంగపుత్ర 115వ జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యకు ఆహ్వాన పత్రిక అందజేశారు. గంగపుత్ర చైతన్య సమితి-తెలంగాణ ప్రతినిధులు ఆయనను కలిసి జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా గంగపుత్ర మహాత్మ ఆచార్య సందిరి బాలయ్య గంగపుత్ర సేవలను స్మరించుకుంటూ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. గంగపుత్ర సామాజిక వర్గ ఐక్యత, అభ్యున్నతి, హక్కుల సాధనకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, బీసీ జాక్ స్టేట్ కోఆర్డినేటర్ గుజ్జ సత్యం తదితరులు పాల్గొన్నారు.

త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా కల్పించాలి

- **లో వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ డీఈకి వినతి**



విశాల భారతి, ఎల్బీనగర్: సాహెబ్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా, లో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కెతావత్ రమేష్ నాయక్ విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు చంపాపేటలోని విద్యుత్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ (డీఈ)ను కలిసి, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ అందించిన లేఖను అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ.. సాహెబ్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడం, లో వోల్టేజ్ సమస్యల కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీఈ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా కాలనీల్లో తక్షణమే త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు, లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వినతిపత్రం ద్వారా కోరారు. వినతిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ ఇంజనీర్ సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రమేష్ నాయక్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి


- **ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమానికి శ్రీకారం**
- **మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి**



రాజేంద్రనగర్, విశాలభారతి : ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మణికొండలోని ఆర్కే సర్కిల్ వద్ద ఆయన ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని ఓటు రూపంలో వ్యక్తపరిచేందుకు అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై పట్టభద్రులకు అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన వారందరూ తమ పేర్లను నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో పట్టభద్రుల భాగస్వామ్యం కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుద్దోలు శ్రీరాములు, సీనియర్ నాయకుడు బషీర్, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, నాయకులు ఈ. గంగాధర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీ మహా పాదయాత్ర

- **అమిత్ షా పాదయాత్రలో పాల్గొన్న హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్**



విశాలభారతి, ఎల్బీనగర్ : ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా హక్కుల సాధనే లక్ష్యంగా బీజేపీ నిర్వహించిన మహా పాదయాత్రలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ పాదయాత్రకు సంఘీభావంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ముందుకు సాగారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా హక్కుల సాధనతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టడమే లక్ష్యంగా నినాదాలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని చాటుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, ప్రజల గొంతుకగా నిలిచేందుకు పార్టీ శ్రేణులు ఐక్యంగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగానే శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్‌తో పాటు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోనగర్ చెత్త కేంద్రాన్ని తరలించాలి

- **వందలాది కుటుంబాల ఆరోగ్యానికి ముప్పు**
- **సమగ్ర విచారణ జరపాలి : బొంగు వెంకటేష్ గౌడ్**



విశాల భారతి, ఎల్బీనగర్ : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్‌లో చెత్త కాలుష్యంపై సమగ్ర విచారణ జరిపి, చెత్త నిల్వ కేంద్రాన్ని తక్షణమే తరలించాలని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. చెత్త నిల్వ, వ్యర్థాల నిర్వహణ కారణంగా పరిసర కాలనీల్లోని వందలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసన, దుమ్ము, పొగతో పాటు భారీ వాహనాల రాకపోకలు, శబ్ద కాలుష్యం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ వాహనాల్లో చెత్తను తీసుకొచ్చి నిల్వ చేస్తున్నారనే ఆరోపణలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాంకీ సంస్థకు సంబంధించిన ఒప్పందాలు, ఆటోనగర్‌లో చెత్త నిల్వకు ఉన్న అనుమతులు, వ్యర్థాల తరలింపు వివరాలను ప్రజలకు తెలియజేయాలని బొంగు వెంకటేష్‌గౌడ్ కోరారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలగకుండా కాలుష్య నివారణ చర్యలు చేపట్టి, చెత్త నిల్వ కేంద్రాన్ని తరలించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆటోనగర్ చెత్త కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు స్థానిక ప్రజల పక్షాన బీసీ పీపుల్స్ ఫెడరేషన్ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పోలీస్ ఉద్యోగాలే లక్ష్యంగా యువతకు దిశానిర్దేశం

- **ఉచిత శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ**
- **అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ.**
- **కష్టపడి చదివితేనే లక్ష్యసాధన:**
- **మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్**
- **పోలీస్ శాఖలో చేరి ప్రజాసేవ చేసే అవకాశం గర్వకారణం**
- **మహబూబాబాద్ కలెక్టర్ స్నేహ శబరీష్**



మహబూబాబాద్ జిల్లా విశాలభారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: పోలీస్ కానిస్టేబుల్, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు జిల్లా పోలీస్ శాఖ అండగా నిలుస్తోంది. అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ, సరైన మార్గదర్శకత్వం అందించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఎస్పీ డా. శబరీష్ సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి, పరీక్షల సన్నద్ధతపై విలువైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ..జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే కష్టానికి మించిన మార్గం లేదని స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధమైన అధ్యయనం, సమయపాలన, నిరంతర సాధన విజయానికి పునాదులని పేర్కొన్నారు. రాత పరీక్షలకే పరిమితం కాకుండా శారీరక సామర్థ్య పరీక్షలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోటీ పరీక్షల సమయంలో ఎదురయ్యే ఒత్తిళ్లు, అపజయాలు, ఆటంకాలకు వెనుకడుగు వేయకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజూ పునశ్చరణ, నమూనా పరీక్షలు నిర్వహించుకుంటూ బలహీనతలను అధిగమించాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ కల్పిస్తున్న ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాల కలను సాకారం చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. యువత తమ లక్ష్యంపై స్పష్టతతో, క్రమశిక్షణతో నిరంతరం శ్రమించాలని అన్నారు. అందుబాటులో ఉన్న సమయాన్ని వృథా చేయకుండా పూర్తిగా చదువుకు కేటాయించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో పోలీస్ శాఖ పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. అటువంటి బాధ్యతాయుతమైన శాఖలో ఉద్యోగం సాధించి ప్రజాసేవలో భాగస్వాములు కావడం గర్వకారణమని అన్నారు. ఉద్యోగం సాధించిన తర్వాత కూడా ప్రజల పట్ల బాధ్యత, అంకితభావం, సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ సాధనలో తోడ్పాటు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన ఉచిత శిక్షణ కార్యక్రమం అభినందనీయమని, ఈ అవకాశాన్ని ప్రతి అభ్యర్థి సద్వినియోగం చేసుకొని విజయం సాధించాలని కలెక్టర్, ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, ఆర్ఐ భాస్కర్, శిక్షకులు భాగ్యకిరణ్, పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

పూజారి దారుణ హత్య



- **3 గంటల్లోనే నిందితులను పట్టుకున్న పోలీసులు**
- **రూ.1.73 కోట్ల బంగారం,నగదు, కారు స్వాధీనం,ఎస్పీ అక్షాంశ్ యాదవ్ అభినందన**



చౌటుప్పల్, విశాలభారతి: పట్టణంలో సంచలనం సృష్టించిన పూజారి హత్య, దోపిడీ కేసును పోలీసులు కేవలం 3 గంటల్లోనే ఛేదించారు.వివరాల్లోకి వెళితే ,ఫిర్యాదుదారుడు గుర్రం సురేష్ (29) తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు రాళ్లబండి సుధాకర్ స్వామి ఆయన మేనమామ. సుధాకర్ స్వామి దేవుడి పూజలు, కొలుపులు చేస్తూ జీవనం సాగించేవాడు. భక్తులు ఆయనకు డబ్బులు, బంగారు ఆభరణాలు కానుకలుగా ఇచ్చేవారు. అక్టోబర్ 31 రాత్రి 9:30 వరకు మేనమామతో ఉన్న సురేష్ ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి 11 గంటలకు ఫోన్ చేయగా, "పవన్ మరియు అతని స్నేహితుడు హర్షు వచ్చారు, వారితో మాట్లాడి పడుకుంటా" అని మృతుడు చెప్పాడు. అర్ధరాత్రి 12:38 కి మృతుడి ఫోన్ నుండి సురేష్‌కు రెండు వాట్సాప్ వాయిస్ మెసేజ్ లు వచ్చాయి. అనుమానంతో సీసీ కెమెరాలు చూడగా అవి పని చేయలేదు. బయటకు వచ్చి చూడగా గేటు, మెష్ డోర్ తెరిచి ఉండటం, ముందు పార్క్ చేసిన టాటా సఫారీ కారు (TG 30 A 5659) కనిపించకపోవడంతో 01:36 కి డయల్ 112 కు ఫోన్ చేశాడు. సమాచారం అందుకున్న చౌటుప్పల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. మొదటి అంతస్తు బెడ్ రూమ్ లో సుధాకర్ స్వామి మంచంపై బోర్లా పడి ఉన్నాడు. ఆయన చేతులు, కాళ్లు చీరలతో కట్టివేసి, కుడి మోచేతి వద్ద, వీపుపై కత్తిపోట్లు పొడిచి దారుణంగా హత్య చేసినట్లు గుర్తించారు.

కేసు నమోదు, వేగంగా దర్యాప్తు:

ఫిర్యాదు మేరకు http://Cr.No.609/2026, U/s 103(1), 309(4), 309(6), 305(b) R/w 3(5) BNS కింద కేసు నమోదు చేశారు.

యాదాద్రిభువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐ పి యస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ చౌటుప్పల్ పి. మధుసూదన్ రెడ్డి సూచనలతో, ఇన్స్పెక్టర్ డి. సతీష్ రెడ్డి, ఎస్ఐ లు కనకటి యాదగిరి, రవీందర్, అజయ్ భార్గవ్ మరియు సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. దొంగిలించిన కారు నంబర్, సాంకేతిక ఆధారాలతో ట్రేస్ చేయగా కారు నాగపూర్ హైవే వైపు వెళ్తున్నట్లు గుర్తించి NH44 పై ఉన్న టోల్ ప్లాజాలను అలర్ట్ చేశారు. దీంతో అప్రమత్తమైన నిర్మల్ జిల్లా పోలీసులు నిందితులను నవంబర్ 01 ఉదయం 04:05 గంటలకు గంజాల్ టోల్ ప్లాజా, నిర్మల్ జిల్లా వద్ద పట్టుకున్నారు. అనంతరం నిందితులను నిర్మల్ లోని అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి కోర్టులో హాజరుపరిచి, తిరిగి సోమవారం జె ఎఫ్ సి ఎం కోర్టు, చౌటుప్పల్ లో హాజరుపరిచారు.

పట్టుబడిన నిందితులు:

A1. పవన్ కుమార్, తండ్రి ప్రకాష్ నారాయణ సాహు, వయసు 21, సోలాంగ్ గ్రామం, సింగ్రౌలి, మధ్యప్రదేశ్. A2. హర్ష్ సంతోష్ పాండే, తండ్రి సంతోష్ పాండే, వయసు 24, సత్నా, మధ్యప్రదేశ్ / లాల్ గంజ్, మిర్జాపూర్, ఉత్తరప్రదేశ్. స్వాధీనం చేసుకున్న సొత్తు మొత్తం విలువ రూ. 1,73,63,300/బంగారం 1 కేజీ 319 గ్రాములు (విలువ రూ. 1.30 కోట్లు) పెద్ద బంగారు కడాలు, చిన్న గాజులు, చైన్, పుస్తెల తాడు, 11 ఉంగరాలు, మామిడి హారం, గుండ్ల హారం, నెక్లెస్ తదితర ఆభరణాలు. వెండి 3 కేజీల 600 గ్రాములు (విలువ రూ. 3.60 లక్షలు) పట్టీలు, కడియాలు, వడ్డాణం, గజ్జెలు తదితరాలు. నగదు రూ. 9,03,300/

వాహనం నల్లటి టాటా సఫారీ కారు రూ. 30 లక్షలు ఆయుధం & ఫోన్లు 23 అంగుళాల కత్తి, ఐఫోన్ 12 ప్రో మాక్స్, రియల్ మీ ఫోన్, మృతుడి ఐఫోన్ 16 ప్రో మాక్స్ (రూ. లక్ష).

ఎస్పీ అభినందన:

కేసు సమాచారం వచ్చిన 3 గంటల్లోనే నేరస్థులను సొత్తుతో సహా పట్టుకున్న డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ సతీష్ రెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్ (సీసీఎస్), ఎస్ఐ లు, హెచ్ సీ లు నరేష్, నర్సిరెడ్డి, పీసీ లు ఉపేందర్, జానకి రాములు, శ్రీను, సందీప్, నాగూర్ వలీ, శేఖర్, బరద్వాజ్, వెంకన్న, జంగయ్య, మహేష్, హెచ్ జీ లు ఉపేందర్, వెంకటేశ్వర్లు, జంగులు, సైదులు, నాగరాజు మరియు నిర్మల్ జిల్లా పోలీసులను ఎస్పీ అక్షాంశ్ యాదవ్ గారు ప్రత్యేకంగా అభినందించారు.

తెలంగాణలో 'ఖేత్ బచావో అభియాన్' అవగాహన సదస్సు

- **సేంద్రియ పోషక జీవ వనరులను అవలంబించాలి**



విశాల భారతి ఇబ్రహీంపట్నం: హైదరాబాద్‌లో నికె వికె సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్, హయత్ నగర్ , తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం, చౌదర్‌పల్లి క్లస్టర్ గ్రామంలో 'ఖేత్ బచావో అభియాన్' సోమవారం ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. సుస్థిర వ్యవసాయం, నేల ఆరోగ్య నిర్వహణ, సమతుల్య ఎరువుల వాడకం, ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై దృష్టి సారించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ , ఉపసర్పంచ్, రైతులు, పాల్గొన్నారు. కేవీకే సైంటిస్ట్ డాక్టర్ సుధీర్ , రైతులకు స్వాగతం పలికి, ఈ కార్యక్రమం యొక్క లక్ష్యాలను వివరించారు. వర్షాధార పరిస్థితులలో పశుగ్రాసం సాగు యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు పశువుల మేత తగినంత సరఫరాను నిర్ధారించడానికి పశుగ్రాసం పరిరక్షణ వ్యూహాలను చర్చించారు. కేవీకె సైంటిస్ట్ డాక్టర్. జి . శ్రీకృష్ణ , సహజ సేంద్రీయ వ్యవసాయ విధానాలు, పండ్ల, కూరగాయ ల విధానాల వివరించారు. కెవికె చెందిన శాస్త్రవేత్త, డాక్టర్ దిలీప్, పోషకాల వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని నివారించడానికి, మట్టి పరీక్ష ఆధారిత సమతుల్య ఎరువుల వాడకం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. నేల ఆరోగ్యాన్ని కాపాడటానికి పంట ఉత్పాదకతను నిలబెట్టడానికి సేంద్రియ పోషక వనరులను, జీవ ఎరువులను అవలంబించాలని ఆమె రైతులకు ప్రోత్సహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏ డి ఏ), ఇబ్రహీంపట్నం ఆర్. శశిధర్ రెడ్డి , పిఎంకిసాన్ పథకంతో సహా వివిధ వ్యవసాయ సంక్షేమ పథకాలపై రైతులకు వివరించి, సహజ వ్యవసాయం యొక్క ప్రయోజనాలను ప్రముఖంగా తెలియజేశారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా పంటలు, కూరగాయలను పండించడం వ్యవసాయం, పశుసంపద, గృహ అవసరాలకు నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవడం యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. యాచారం వ్యవసాయ అధికారి రవినాథ్ మాట్లాడుతూ పంట ఉత్పత్తి, నేల ఆరోగ్య నిర్వహణ, నీటి సంరక్షణ అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలపై వ్యవసాయ నిపుణులతో సంభాషించడానికి మార్గదర్శకత్వం కోరడానికి ఈ ప్రచార కార్యక్రమం రైతులకు ఒక వేదికను అందించింది. రైతుల సందేహాలకు నిపుణులు సమాధానమిచ్చారు. వెటర్నరీ డాక్టర్ సంత్. రేఖ,ఎల్నినో వర్షాభావ పరిస్థితుల్లో పశువులకు పోషణ, ప్రస్తుత వెటర్నరీ స్కీమ్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతుల అవగాహనను బలోపేతం చేయడం, వనరుల వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం మరియు వర్షాధార ప్రాంతాలలో వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని వారు తెలిపారు.

అమిత్ షా పాదయాత్రకు బైరామల్‌గూడ నుంచి భారీగా బీజేపీ శ్రేణులు

- **డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల తరలింపు**



విశాల భారతి, ఎల్బీనగర్ : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాదయాత్రలో పాల్గొనేందుకు బైరామల్‌గూడ డివిజన్ (హస్తినాపురం) నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బైరామల్‌గూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాదయాత్రకు బయలుదేరారు. పార్టీ పట్ల తమ నిబద్ధతను చాటుతూ జై శ్రీరామ్, భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బైరామల్‌గూడ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపే రంగన్న ఆత్మీయ సమ్మేళనం

- **ప్రమీదా గార్డెన్స్‌లో ఉ.10గం.ల నుంచి కార్యక్రమం.**
- **రోజంతా కార్యకర్తలతో మమేకం కానున్న మల్‌రెడ్డి రంగారెడ్డి.**



విశాలభారతి, ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఆత్మీయంగా మమేకమయ్యేందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రంగన్న ఆత్మీయ సమ్మేళనం'కు శ్రీకారం చుట్టారు. ఈ నెల 4వ తేదీ బుధవారం బొంగ్లూర్ గేట్ సమీపంలోని ప్రమీదా గార్డెన్స్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో నేరుగా మమేకమై వారి కష్టసుఖాలను తెలుసుకోవడం, గత మూడేళ్లలో ప్రభుత్వం, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల విశ్లేషణ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశం. దసరా, దీపావళి పండుగల మధ్య కార్యకర్తలతో ఆత్మీయంగా గడిపేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యతనిస్తూ, వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేలా సమ్మేళనాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హాజరయ్యే కార్యకర్తలందరికీ ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి కార్యకర్త ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, పరస్పర ఆత్మీయత, సమన్వయంతో ముందుకు సాగేందుకు ఈ సమ్మేళనం వేదిక వేదిక సాగనుందని అన్నారు.

బీజేపీ శ్రేణుల భారీ తరలింపు



రాజేంద్రనగర్, విశాలభారతి : ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం - అరాచకాన్ని తరిమికొడదాం అనే నినాదంతో హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పాదయాత్రకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లాయి. నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలు, మున్సిపాలిటీలు, డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాటేదాన్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద మహా పాదయాత్రకు బయలుదేరే కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. పార్టీ జెండా ఊపి నాయకులు, కార్యకర్తల వాహన శ్రేణిని ఆయన ప్రారంభించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఘనస్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా హైదరాబాద్‌కు బయలుదేరాయి. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, రాజ్యాంగబద్ధమైన సంస్థలను పరిరక్షించడం భారతీయ జనతా పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పార్టీ నిరంతరం పోరాటం సాగిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, వివిధ మండలాలు, మున్సిపాలిటీల నాయకులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, భారతీయ జనతా యువమోర్చా నాయకులు, కార్యకర్తలు, యువకులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాటేదాన్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ తరలింపు కార్యక్రమం బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ముందుకు సాగడం ఈ కార్యక్రమంలో స్పష్టంగా కనిపించింది.

ఉప్పుగల్లు గ్రామంలో వీధి కుక్కల దాడి ఏడు గొర్రె పిల్లల మృతి



జనగామ విశాల భారతి ; మండలం ఉప్పుగల్లు గ్రామంలో వీధి కుక్కలు గొర్రె పిల్లలపై దాడి చేయడంతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది గ్రామానికి చెందిన బండి కొమురయ్యకు చెందిన గొర్రె పిల్లలను వీధి కుక్కలు ఒక్కసారిగా విరుచుకు పడ్డాయి ఈ దాడిలో ఏడు గొర్రె పిల్లలు అక్కడే మృతి చెందాయి, చెందగా మరో ఎనిమిది గొర్రె పిల్లలు గాయపడ్డాయి, ఈ ఘటనతో గొర్రెల కాపరి బండి కొమురయ్యకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది గొర్రెల పెంపకం పై ఆధారపడి జీవనం సాగిస్తున్న బాధిత కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తుంది గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కుక్కల నియంత్రణ చేపట్టాలని గ్రామస్తులు కోరుకుంటూ, అలాగే బాధిత కుటుంబానికి ఆదుకుని తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

కురవి పశువుల సంతలో కాంట్రాక్టర్ అరాచకం!

- పశువుల సంతా.. అక్రమ వసూళ్లకు అడ్డానా?
- అక్రమ వసూళ్లకు అడ్డూఅదుపూ లేదా..
- రసీదులు ఖాళీ.. వసూళ్లు భారీ..
- కురవి పశువుల సంతలో రైతులకు నిలువు దోపిడీ!
- పశువుల సంతలో అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట ఏదీ..?
- అధికారుల నోటీసులంటే లెక్కలేదా..?
- నోటీసులిచ్చినా మారని కాంట్రాక్టర్ తీరు
- నిబంధనలను తుంగలో తొక్కి రైతుల జేబులకు చిల్లులు!
- ఖాళీ రసీదులతో అక్రమ దందా

కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: రైతుల శ్రమను ఆసరాగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కురవి పశువుల సంత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునే వారే కరువయ్యారా? గ్రామపంచాయతీ నిబంధనలు, అధికారుల హెచ్చరికలు, నోటీసులు అన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయా? అన్న ప్రశ్నలు ప్రస్తుతం కురవి పశువుల సంతలో చోటుచేసుకుంటున్న పరిణామాలతో తెరపైకి వస్తున్నాయి. ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు పశువుల సంతలో పశువుల క్రయవిక్రయాల కోసం వచ్చే రైతుల నుంచి నిర్ణయించిన రుసుముల కంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయవద్దని అధికారులు హెచ్చరించినా, నోటీసులు జారీ చేసినా కాంట్రాక్టర్ తీరు మారకపోవడం గమనార్హం.

నిబంధనలు బేఖాతర్.. వసూళ్లలో మాత్రం దూకుడు!

కురవి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే పశువుల సంతకు వివిధ మండలాల నుంచి

రైతులు తమ పశువులు, గొర్రెలు, మేకలను విక్రయించేందుకు వస్తుంటారు. ఈ క్రమంలో గ్రామపంచాయతీ నిర్ణయించిన రుసుముల ప్రకారం ఒక్కో పశువుకు రూ.300, గొర్రె లేదా మేకకు రూ.200 మాత్రమే వసూలు చేయాలి. కానీ కాంట్రాక్టర్ మాత్రం ఈ నిబంధనలను పక్కనపెట్టి ఒక్కో పశువుకు రూ.400, గొర్రె లేదా మేకకు రూ.250 చొప్పున వసూలు చేస్తున్నట్లు బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. పశువుల విషయంలో నిర్ణీత రుసుము



గొర్రె, మేకకు రూ.250 వసూలు చేస్తున్నారు: రైతు దేవేందర్.

కంటే రూ.100, గొర్రెలు, మేకల విషయంలో రూ.50 అదనంగా వసూలు చేస్తుండటంతో సంతకు వచ్చే రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అమ్మినవారి నుంచి, కొనుగోలు చేసినవారి నుంచి విడివిడిగా డబ్బులు వసూలు చేస్తూ రైతులపై అదనపు భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తమవుతోంది.

రసీదుల జారీలోనూ అక్రమాల ఆరోపణలు!

అధిక వసూళ్లకు తోడు రసీదుల వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారింది. రైతుల నుంచి ఎంత మొత్తం వసూలు చేస్తున్నారో రహదారి రసీదులపై స్పష్టంగా నమోదు చేయకుండా ఖాళీ రసీదులు అందిస్తున్నారని బాధితులు చెబుతున్నారు. దీంతో

వాస్తవంగా ఎంత వసూలు చేశారు? గ్రామపంచాయతీకి ఎంత ఆదాయం జమ చేస్తున్నారు? అనే అంశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక రుసుముల వివరాలు తెలియకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. గ్రామపంచాయతీ జారీ చేసిన అధికారిక రసీదు పుస్తకాలను మాత్రమే వినియోగించాల్సి ఉండగా, నిబంధనల అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు.

నోటీసులిచ్చినా నోరుమెదపని పరిస్థితి!

గతంలోనూ పశువుల సంతలో అక్రమ వసూళ్లపై పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో గ్రామపంచాయతీ అధికారులు స్పందించారు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ఉల్లంఘనలు పునరావృతమైతే టెండర్ రద్దు చేస్తామని కార్యదర్శి కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ వైఖరిలో మార్పు రాకపోవడం అధికారుల ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తున్నారనే విమర్శలకు



పశువు ఒక్కింటికి రూ.400 వసూలు చేస్తున్నారు: కుంజ నారాయణ.

తావిస్తోంది. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా పరిస్థితి యథాతథంగా కొనసాగితే వాటి ప్రయోజనం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కేవలం నోటీసులతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

దొంగ పశువుల వ్యవహారంలోనూ బాధ్యతారాహిత్యమేనా?

సంతలో విక్రయించే పశువులు, గొర్రెలు, మేకలకు సంబంధించిన క్రయవిక్రయాల విషయంలోనూ నిబంధనలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉంటుంది. పశువులు దొంగతనానికి సంబంధించినవిగా తేలితే క్రయవిక్రయాల వ్యవహారంలో కాంట్రాక్టర్ బాధ్యత వహించాల్సి ఉండగా, రసీదులపై మాత్రం 'కొన్నవారిదే బాధ్యత' అని ముద్రించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇది తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నమా? లేక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి సోమవారం సంతలో ధరల పట్టికలు ఏర్పాటు చేయడం, టామ్‌టామ్ ద్వారా రుసుముల వివరాలు ప్రచారం చేయడం వంటి కనీస నిబంధనలు సైతం తప్పనిసరిగా అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రైతుల కష్టార్జితంపై అదనపు భారం.. చర్యలు తీసుకోవాల్సిందే!

సంతకు వచ్చే రైతులు ఇప్పటికే రవాణా ఖర్చులు, పశువుల పోషణ ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిర్ణీత రుసుముల కంటే అదనంగా వసూలు చేయడం రైతుల కష్టాన్ని దోచుకోవడమేనని బాధితులు మండిపడుతున్నారు. ప్రతి సోమవారం అధికారులు సంతను పర్యవేక్షించాల్సి



"విశాల భారతి" కథనానికి స్పందన

- సంత గుత్తేదారుకి గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసులు

కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు పశువుల సంతలో సాగుతున్న అక్రమ వసూళ్లపై "విశాల భారతి" దినపత్రికలో ఈనెల 27న ప్రచురితమైన ప్రత్యేక కథనానికి అధికారులు తీవ్రంగా స్పందించారు. ఈ వార్తపై సమగ్ర విచారణ చేపట్టిన కురవి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేష్ శనివారం సంత కాంట్రాక్టర్ దూదిమెట్ల వెంకటేశ్వర్లుకు అధికారికంగా నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి జారీ చేసిన ప్రకటన ప్రకారం గ్రామ పంచాయతీ అనుమతించిన నిబంధనలకు విరుద్ధంగా సంతలో రహదారి, తై బజార్ పేరుతో అదనపు రుసుములు వసూలు చేస్తున్నట్లు వార్తలు రావడంతో స్పందించినట్లు తెలిపారు. కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం నిర్దేశించిన రుసుములు మాత్రమే వసూలు చేయాలని, నిబంధనలను దాటి రైతులు, వ్యాపారుల నుంచి అక్రమంగా ఒక రూపాయి కూడా ఎక్కువ తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు జరిపినా, లేదా సంతకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ నోటీసును ఉల్లంఘించి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు తేలితే, కాంట్రాక్టర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కాంట్రాక్టును కూడా రద్దు చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. "విశాల భారతి" కథనం ద్వారా విషయం వెలుగులోకి రావడం, అధికారులు తక్షణమే స్పందించి నోటీసులు జారీ చేయడంతో స్థానిక రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

కురవి పశువుల సంతలో అక్రమ వసూళ్ల కలకలం!

విశాల భారతి Main Edition Page 5 01 Nov 2026
For Advertisement Call +91 99121 62531

ఉన్నప్పటికీ తనిఖీలు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ ఉన్నతాధికారులు స్పందించి వసూళ్లపై సమగ్ర విచారణ జరిపి, రసీదుల వ్యవహారాన్ని పరిశీలించి, అక్రమాలు రుజువైతే కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. హెచ్చరికలు, నోటీసులతో కాలయాపన చేయకుండా తక్షణమే టెండర్ రద్దు చేసి కొత్తగా పారదర్శక విధానంలో టెండర్ నిర్వహించాలని, రైతులకు న్యాయం చేయాలని కురవి సంతకు వచ్చే రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పశువు ఒక్కింటికి రూ.400 వసూలు చేస్తున్నారు: కుంజ నారాయణ.

గంగారం మండలానికి చెందిన బాధిత రైతు కుంజ నారాయణ మాట్లాడుతూ.. పశువును విక్రయించిన రైతు నుంచి రూ.200, కొనుగోలు చేసిన రైతు నుంచి మరో రూ.200 చొప్పున మొత్తం రూ.400 వసూలు చేస్తున్నారని తెలిపారు. నిర్ణీత రుసుము కంటే అధికంగా డబ్బులు తీసుకుంటూ, వసూలు చేసిన మొత్తాన్ని రహదారి రసీదుపై నమోదు చేయకుండా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

గొర్రె, మేకకు రూ.250 వసూలు చేస్తున్నారు: రైతు దేవేందర్.

రైతు దేవేందర్ మాట్లాడుతూ.. ఒక్కో గొర్రె, మేకకు రూ.250 వసూలు చేస్తున్నారని, విక్రయదారుడి నుంచి రూ.150, కొనుగోలుదారుడి నుంచి రూ.100 తీసుకుంటున్నారని తెలిపారు. నిర్ణీత రుసుము రూ.200 కాగా అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారని, చెల్లించిన మొత్తానికి అనుగుణంగా రసీదులు ఇవ్వడం లేదని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు.

ఆర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలి

- ప్రజావాణికి 116 ఫిర్యాదులు
- జిల్లా అదనపు కలెక్టర్ లు కిరణ్మయి చంద్రారెడ్డి



విశాలభారతి, ఇబ్రహీంపట్నం: ఆర్జీలను పరిశీలించి తక్షణమే సమస్యల ను పరిష్కరించాలని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 116 ఫిర్యాదులు అందాయి. జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 67 ఫిర్యాదులు, ఇతర శాఖలకు సంబంధించి 49 ఫిర్యాదులు అందాయి. మొత్తం 116 అర్జీలు స్వీకరించిన అధికారులు వాటిని సంబంధిత శాఖలకు పంపించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిహెచ్ఎంసి మున్సిపల్ కార్పొరేషన్ ఆదిభట్ల

- సర్కిల్ 15 శంషాబాద్ జోన్ పరిధిలోని
- అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి
- డిప్యూటీ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి



విశాలభారతి ఇబ్రహీంపట్నం: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఆదిభట్ల సర్కిల్-15, శంషాబాద్ జోన్ పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేర్లను పట్టభద్రుల ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అర్హులైన పట్టభద్రులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తు చేసుకునే విధానం

అర్హులైన పట్టభద్రులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తు లింక్

https://ceotserms2.telangana.gov.in/MLC/Form18.aspx*

దరఖాస్తు చేసుకునే సమయంలో అవసరమైన విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు ఇతర వివరాలను సమర్పించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ 06112026

కావున ఆదిభట్ల సర్కిల్-15 పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

అమిత్ షా పాదయాత్రకు తరలివెళ్లిన అడిక్మెట్ బిజెపి నాయకులు



ముషీరాబాద్,విశాల భారతి: కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం సాయంత్రం బషీర్‌బాగ్ నుంచి ఎంజే మార్కెట్ వరకు నిర్వహించే పాదయాత్రకు అడిక్మెట్ నుంచి బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. డివిజన్ బిజెపి అధ్యక్షులు పాశం సాయి కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 250 మంది బీజేపీ కార్యకర్తలు ఐదు బస్సుల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా పాశం సాయి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలనకు వ్యతిరేకంగా లోక్‌తంత్ర బచావో.. అరాచక్ హటావో' నినాదంతో ఈ పాదయాత్ర సాగుతుందన్నారు. టీఎస్‌పీఎస్సీ, వీఆర్వో నియామకాల విషయంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిర్వహిస్తున్న ఈ యాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ శ్రేణులు పోరాటంలో భాగస్వాములవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండిన్య ప్రసాద్, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పోచారంలో కాలుష్య పరిశ్రమలను తరలించాలి

- సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే స్పందించాలి
- గ్రామస్థుడు చరణ్ రాజు గౌడ్ డిమాండ్



విశాలభారతి, ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామ పరిధిలో కొనసాగుతున్న రైస్ మిల్లులు, ప్లైవుడ్ పరిశ్రమల కారణంగా తీవ్ర వాయు కాలుష్యం ఏర్పడుతోందని గ్రామస్థుడు చరణ్ రాజు గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలను జనావాసాలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో సుమారు ఎనిమిది ప్లైవుడ్ పరిశ్రమలు కొనసాగుతున్నాయని, వాటి నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి, పొగ కారణంగా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పరిశ్రమల కాలుష్యంతో స్వచ్ఛమైన గాలి పీల్చుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఆరోగ్య శాఖల అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని కోరారు. కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిశ్రమలను గ్రామానికి దూరంగా తరలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని చరణ్ రాజు గౌడ్ అధికారులను విజ్ఞప్తి చేశారు.

దీపావళి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- డీసీపీ రక్షిత కృష్ణమూర్తి



సికింద్రాబాద్, విశాల భారతి : రానున్న దీపావళి పండుగ సందర్భంగా ప్రజల భద్రత దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై బాణసంచా దుకాణాల యజమానులతో పోలీస్, ఫైర్ డిపార్ట్‌మెంట్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల సమక్షంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం రాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి బాణసంచా విక్రయదారులకు పలు కీలక సూచనలు చేశారు. బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ముందు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని, దుకాణాల నిర్మాణంలో నిబంధనలు పాటిస్తూ అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు మాట్లాడి దీపావళి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దుకాణాల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై బాణసంచా వ్యాపారులకు అవగాహన కల్పించారు.

అమిత్ షా పాదయాత్రకు మాన్సూరాబాద్ నుంచి భారీగా బీజేపీ శ్రేణులు

- మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి
- ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల తరలింపు



విశాలభారతి, ఎల్బీనగర్ : కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాదయాత్రలో పాల్గొనేందుకు మాన్సూరాబాద్ ప్రాంతం నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు, సీనియర్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాదయాత్రలో పాల్గొనేందుకు ఉత్సాహంగా బయలుదేరారు. పార్టీ జెండాలు చేతబట్టి, నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ముందుకు సాగుతూ ప్రజల్లో పార్టీ భావజాలాన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మాన్సూరాబాద్ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో బీజేపీ శ్రేణులు తరలిరావడం పార్టీ పట్ల వారి నిబద్ధతకు, ఐక్యతకు నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మాన్సూరాబాద్ ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు, సీనియర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ భీమనపల్లి శేఖర్ గుండెపోటుతో మృతి

- వెలమకన్నే గ్రామంలో భౌతికకాయానికి నివాళులర్పించిన టీయూడబ్ల్యూజే–ఐజేయు నేతలు.. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా



విశాల భారతి, ఎల్బీనగర్: ప్రజాశక్తి, సూర్య దినపత్రికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ ప్రాంతంలో జర్నలిస్టుగా పనిచేసిన భీమనపల్లి శేఖర్ గుండెపోటుతో ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతి పట్ల జర్నలిస్టు సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వెలమకన్నే గ్రామంలో ఉన్న శేఖర్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. శేఖర్ కుటుంబానికి జర్నలిస్టు సంఘాల నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటామని టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు భరోసా కల్పించారు. జర్నలిస్టుగా పనిచేసిన శేఖర్ ఆకస్మిక మృతి పట్ల పలువురు జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ జే. కిషన్ (రాధాకిషన్), జిల్లా సంయుక్త కార్యదర్శి గొల్లంపల్లి ఆంజనేయులు, ట్రెజరర్ శశిపాల్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు బాణాల మధుసూదనాచారి, చాపల శ్రీనివాస్, నర్రి రమేష్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం లోని ప్రభుత్వ పాఠశాలలకు అదనపు క్లాస్ రూమ్లు

- ముఖ్య మంత్రి, పిసిసి అధ్యక్షుడు, జిల్లా ఇంచార్జి మంత్రి, ప్రభుత్వ ప్రధాన సలహాదారి, లకు కృతజ్ఞతలు తెలిపిన వినయ్ రెడ్డి.



విశాలభారతి ఆర్మూర్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు అదనపు క్లాస్ రూమ్ లు ఆర్మూర్ మండలం 11, ఆలూర్ మండలం 10, మాక్లూర్ మండలం 10, నందిపేట్ మండలం 25 మొత్తం 56 క్లాస్ రూములు విలువ 8.4 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు సుదర్శన్ రెడ్డి, లకు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలియజేశారు.


పార్కింగ్ వివాదం.. దాడికి దారితీసిన ఘర్షణ

రాజేంద్రనగర్, విశాలభారతి : జీహెచ్ఎంసీ డివిజన్ 122 పరిధిలోని డీడీ కాలనీలో బైక్ పార్కింగ్ విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఆదివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో భార్యాభర్తలపై దాడి జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ దాడిలో వెంకట్ రెడ్డికి తీవ్ర గాయాలై రక్తసిక్తమయ్యారని స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం.. రోడ్డుపై ద్విచక్ర వాహనం నిలిపే విషయంలో ఇరువర్గాల మధ్య చిన్నపాటి వివాదం తలెత్తింది. ఈ క్రమంలో అనధికార పాఠశాల యాజమాన్యానికి చెందిన వ్యక్తిగా పేర్కొంటున్న సాయి నాగ్ సింగ్, అతని తండ్రి సుదర్శన సింగ్ మరికొందరితో కలిసి పక్కింట్లో నివసిస్తున్న వెంకట్ రెడ్డి, పుష్ప దంపతులపై దాడికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనతో కాలనీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కాలనీ వాసులు సోమవారం బాధితుడి కుమారుడు ప్రణీత్ రెడ్డి ఆధ్వర్యంలో సంబంధిత పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రణీత్ రెడ్డి మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి ఎలాంటి ప్రాణహాని కలగకుండా తగిన పోలీసు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి



చేశారు. చిన్నపాటి పార్కింగ్ వివాదాన్ని సాకుగా చేసుకుని దాడులకు పాల్పడటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో పాల్గొన్న కాలనీ వాసులు మాట్లాడుతూ.. ప్రజల మధ్య తలెత్తే చిన్నపాటి వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాల్సింది పోయి దాడులకు దిగడం సరికాదన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా సంబంధిత పాఠశాల నిర్వహణపై కూడా అధికారులు సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయడంతో పాటు దాడికి బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయాలని, బాధితులకు పోలీసు రక్షణ కల్పించాలని, పాఠశాల నిర్వహణపై విచారణ చేపట్టాలని కాలనీ వాసులు కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు.. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అంటూ కాలనీ వాసులు నినదించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మేము సిద్ధం



- తోకల ప్రసాద్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు

భద్రాచలం, విశాలభారతి: ఎస్సీల అభివృద్ధి, సంక్షేమం కోసం మరియు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలమంతా కలిసికట్టుగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ భద్రాచలం మండల అధ్యక్షులు తోకల ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ లంజపల్లి వెంకట నరసయ్య, జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ పడిసిరి శ్రీనివాస్, జిల్లా జనరల్ సెక్రటరీ జట్టి జయమ్మ, జిల్లా సెక్రటరీ రాయపూడి సుధారాణి, నియోజకవర్గ అధ్యక్షులు కోకిల దీక్షిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎస్సీల అభివృద్ధి కోసం ఇచ్చిన హామీల అమలు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగం, ఎస్సీల సంక్షేమం వంటి అంశాలపై ఎస్సీ సెల్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తారని, అభ్యర్థిని గెలిపించుకోవడంలో ముందుండి తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని స్పష్టం చేశారు. అలాగే ఎస్సీల అభివృద్ధితో పాటు కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బుయ్యని వినోద్‌కు ఎస్సీ సెల్ ఉపాధ్యక్ష పదవి స్థానిక భద్రాచలం పాలకేంద్రం ఏరియాకు చెందిన బుయ్యని వినోద్‌ను ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను తుచ తప్పకుండా నిర్వర్తిస్తూ, ఎస్సీల అభివృద్ధికి మరియు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సీ సెల్ నాయకులు మహిళలు సరోజిని, గంపల ఆరోగ్యం, రాజేశ్వరి, ఫాతిమా, నాగలక్ష్మి, శ్రీనిధి, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు రాజకీయ సంకెళ్లు!



- నల్లెల్లలో 'ఇందిరమ్మ' ఎంపికపై దుమారం
- పూరిగుడిసెల్లో నిరుపేదలు.. జాబితాల్లో మాత్రం పలుకుబడి ఉన్నవారా?
- 25 ఏళ్లుగా గుడిసెల్లోనే బతుకులు
- కిరాయి గదుల్లో కుటుంబాల పోరాటం
- ఎమ్మెల్యే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ; నిరుపేదలకు నిలువ నీడ కల్పించాల్సిన ఇందిరమ్మ ఇళ్ల పథకం.. నల్లెల్ల గ్రామంలో వివాదాలకు దారితీస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్హతే ప్రామాణికంగా జరగాల్సిన లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ప్రాధాన్యతకు పెద్దపీట వేస్తున్నారా? పూరిగుడిసెల్లో బతుకులు వెళ్లదీస్తున్న పేదలకు ఇళ్లు దక్కకుండా, అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నవారికే కేటాయింపులు జరుగుతున్నాయా? అన్న ప్రశ్నలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. సొంతింటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలు తమకు జరిగిన అన్యాయంపై గళమెత్తుతున్నాయి.

గుడిసెల్లో పేదరికం.. ఎంపికలో రాజకీయాలా?

ప్రభుత్వం నిరుపేదలకు పక్కా ఇళ్లు అందించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ పథకాన్ని అమలు చేస్తోంది. అర్హుల ఎంపికలో పారదర్శకత కోసం గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నిజమైన లబ్ధిదారులను గుర్తించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ నల్లెల్లలో ఈ విధానం పక్కదారి పట్టిందని బాధితులు ఆరోపిస్తున్నారు. నివాసానికి కనీస సౌకర్యం లేని కుటుంబాలను విస్మరించి, రాజకీయ అనుకూలత ఆధారంగా ఇళ్ల కేటాయింపులు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పార్టీ ముద్ర ఉంటేనే ఇల్లు వస్తుందా?

ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ సమానంగా అందాల్సి ఉండగా, పార్టీలు చూసి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. తమకు ఇల్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తే.. మీరు మా పార్టీకి చెందినవారు కాదు, మీకు ఇల్లు ఇవ్వలేమంటూ సమాధానాలు చెబుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదరికానికి కూడా పార్టీ రంగు పులమడం ఏమిటని నిలదీస్తున్నారు. ఇందిరమ్మ ఇల్లు అనేది ప్రభుత్వ పథకమా? లేక పార్టీ కార్యకర్తలకు ఇచ్చే ప్రత్యేక బహుమతా? అని ప్రశ్నిస్తున్నారు.



కిరాయి రూంలో జీవిస్తున్నాం : చెన్నబోయిన నరేష్(నల్లెల్ల)

నే ఉద్దేశంతో ఇందిరమ్మ పథకాన్ని అమలు చేస్తోంది. అర్హుల ఎంపికలో పారదర్శకత కోసం గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నిజమైన లబ్ధిదారులను గుర్తించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ నల్లెల్లలో ఈ విధానం పక్కదారి పట్టిందని బాధితులు ఆరోపిస్తున్నారు. నివాసానికి కనీస సౌకర్యం లేని కుటుంబాలను విస్మరించి, రాజకీయ అనుకూలత ఆధారంగా ఇళ్ల కేటాయింపులు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పార్టీ ముద్ర ఉంటేనే ఇల్లు వస్తుందా?

ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ



తాటి కమ్మల గుడిసెలో జీవిస్తున్నాం : శేషగాని వెంకన్న గౌడ్ (నల్లెల్ల)

కిరాయి గదే నిలువ నీడ..

ముగ్గురు పిల్లలతో నరేష్ పోరాటం

నల్లెల్లకు చెందిన చెన్నబోయిన నరేష్ తన ఆవేద

నను వెల్లడిస్తూ.. సొంత ఇల్లు కట్టుకునే స్థోమత లేక భార్య, ముగ్గురు పిల్లలతో కిరాయి గదిలో జీవిస్తున్నామని తెలిపారు. భార్య కూలి పనులకు వెళ్తుండగా, తాను ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నానన్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు ఉన్నప్పటికీ కమిటీ సభ్యులు ఇల్లు మంజూరు చేయడం లేదని వాపోయారు.

పాతికేళ్లుగా తాటాకుల గుడిసే ఆధారం.

శేషగాని వెంకన్న గౌడ్ మాట్లాడుతూ.. తమది నిరుపేద కుటుంబమని, కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు. గత 25 ఏళ్లుగా కుటుంబంతో కలిసి తాటాకుల గుడిసెలోనే కాలం వెళ్లదీస్తున్నామని, ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అయినప్పటికీ కమిటీ సభ్యులు ఇల్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే గారూ.. మా గోడు వినండి!

ధర్మారపు మాట్లాడుతూ.. మట్టి గోడలు, వాసాలు, గడ్డి కప్పుతో కూడిన గుడిసెలో ఏళ్లుగా జీవిస్తున్నామని తెలిపారు. వర్షం వస్తే ఇంట్లోకి నీరు చేరి కుటుంబం



ఎమ్మెల్యే గారు మా గోడుని పట్టించుకోండి : ధర్మారపు (నల్లెల్ల)

తీవ్ర ఇబ్బందులు పడుతోందన్నారు. ఇందిరమ్మ ఇల్లు అడిగితే మీరు మా పార్టీ కాదు, ఇల్లు ఇవ్వమంటూ కమిటీ సభ్యులు చెబుతున్నారని ఆరోపించారు. తాము ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్‌కు ఓటు వేసినప్పటికీ తమకు ఇల్లు మంజూరు కాలేదని, కనీసం ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

అర్హతకు న్యాయం చేయాలి..

రాజకీయాలకు కాదు!

నల్లెల్లలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై వస్తున్న ఆరోపణలు అధికార యంత్రాంగం దృష్టికి వెళ్లాల్సిన అవసరం ఉంది. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు గ్రామంలో ప్రత్యక్షంగా పర్యటించి, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పునఃపరిశీలించాలని బాధితులు కోరుతున్నారు. కిరాయి గదుల్లో, తాటాకుల గుడిసెల్లో, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాల వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అర్హులైన నిరుపేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎంపికలో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పేదవాడికి కావాల్సింది పార్టీ అండ కాదు.. సొంతింటి నీడ!

ప్రయాణికుల సౌకర్యాలపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రత్యేక దృష్టి

- సులభ్ కాంప్లెక్స్ పనుల పరిశీలన
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు



విశాలభారతి, ఎల్బీనగర్ : చింతలకుంట ఎల్‌బీటీ మార్కెట్ సర్వీస్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మిస్తున్న సులభ్ కాంప్లెక్స్ పనులను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరిశీలించారు. దూర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో బస్‌స్టాప్ వద్ద నిర్మిస్తున్న సులభ్ కాంప్లెక్స్ పనులను ఆయన పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా రెండుసార్లు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసర ప్రాంతాల్లో దుర్వాసన రాకుండా, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చింతలకుంట సర్వీస్ రోడ్డుపై ప్రతిరోజూ తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నేపథ్యంలో స్థానిక ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను పిలిపించి మాట్లాడారు. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించి, వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సమీపంలోని సింధూర్ ఎన్‌క్లేవ్ కాలనీ ప్రతినిధులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసి తమ కాలనీలోకి వెళ్లేందుకు ప్రత్యేక రహదారి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చర్చించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ఎస్సీ కాలనీలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు
- బీసీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం



విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని అబ్దుల్లాపూర్ ఓల్డ్ గ్రామంలో అభివృద్ధి పనులకు సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎస్సీ ఫండ్ నుంచి రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు, బీసీ కాలనీలోని రామాజీ ఫిలిం సిటీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ, గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంతటి సుష్మా అశోక్ గౌడ్, వార్డు సభ్యులు మొగుళ్ళ జీవన్ కుమార్ రెడ్డి, మాచగోని మహేందర్ ముదిరాజ్, గడ్డమీద దశరథ గౌడ్, తూర్పునూరి శివకుమార్ గౌడ్, బొడుసు రాఘవేందర్ యాదవ్, బత్తిని దీపిక గౌడ్, దర్శనం యాదయ్య, కేతరాజు నరసింహ, లింగాల అఖిల్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి

- డంపింగ్ యార్డ్‌ను విరమించుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



విశాల భారతి, షాద్ నగర్: సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ, జీవో నంబర్ 641ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 30వ రోజు రిలే నిరాహార దీక్షలో పోల్కోనిగుట్ట తండా ప్రజలు పాల్గొన్నారు.ఈ నిరాహార దీక్షలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని తన సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల జీవించే హక్కులను, రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. రైతుల భూములు, ప్రజల నీరు, గాలి, భవిష్యత్తును కాపాడేందుకు జరుగుతున్న ఈ పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకుని జీవో నంబర్ 641ను రద్దు చేయాలని, డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు, జేఏసీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మూడవత్ రాంబల్ నాయక్, మాజీ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ సర్పంచ్ వడ్డె బాలయ్య తదితరులున్నారు.

కాశీ విశ్వనాథుని సన్నిధిలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని విశ్వేశ్వరుడికి ప్రత్యేక ప్రార్థనలు

విశాల భారతి,షాద్ నగర్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం పవిత్ర కాశీ క్షేత్రంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు పీఏసీఎస్ చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి,మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, సామాజికవేత్త కేకే కృష్ణ, రఘు నాయక్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, లింగారెడ్డి గూడా ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ మాజీ ఉపసర్పంచ్ సీతారాం, యువ నాయకుడు గుట్ట రాజు తదితరులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాశీ విశ్వేశ్వరుడి కృపాకటాక్షాలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని, రైతులకు, ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరిపై విశ్వేశ్వరుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన

- దల భూముల జోలికి వస్తే అటవీ అధికారుల ఆటలు సాగవు
- 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతులకు నోటీసులు ఇవ్వడం సహించం
- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలి
- సబ్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేత



విశాల భారతి, ఆర్మూర్: పేదలు, నిరుపేద రైతులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూముల జోలికి వస్తే అటవీ అధికారుల ఆటలు సాగవని, 60 ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న రైతులకు నోటీసులు జారీ చేయడాన్ని సహించబోమని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి బి.దేవారం లు హెచ్చరించారు. పేద రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుపేదలకు న్యాయం చేయాలని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ఇల్లు నిర్మించుకోవడానికి స్థలం లేని వారికి ఇంటి స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణానికి లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ ఏఐయుకెఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రోజు ఆర్మూర్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని జంబి హనుమాన్ మందిరం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు సుమారు 800 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ను కలిసి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా జరిగిన ఆందోళనలో ప్రజలను ఉద్దేశించి రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, గత 60 ఏళ్లుగా పేద రైతులు తమ కుటుంబాల జీవనాధారంగా భావించి సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి అటవీ శాఖ అధికారులు నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని అన్నారు. తరతరాలుగా సాగులో ఉన్న భూముల నుంచి పేద రైతులను తొలగించే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పేద రైతులను భయభ్రాంతులకు గురిచేసే విధానాలను అధికారులు మానుకోవాలని, రైతుల సాగు హక్కులకు భంగం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. 22A నిషేధిత భూముల జాబితా నుంచి అర్హులైన రైతుల భూములను తొలగించి, దీర్ఘకాలంగా సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన పేదలందరికీ న్యాయం చేయాలని అన్నారు. సొంత ఇంటి స్థలం లేని నిరుపేదలకు ముందుగా ఇంటి స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పేదల భూములు, నివాస హక్కులు, జీవనాధారమైన వ్యవసాయ భూముల పరిరక్షణ కోసం రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజల న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

ప్రధాన డిమాండ్లు:

1.60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేద రైతులకు న్యాయం చేయాలి.

2.సాగులో ఉన్న రైతులకు అటవీ శాఖ అధికారు లు జారీ చేసిన నోటీసులను ఉపసంహరించుకోవాలి.

3.22A నిషేధిత భూముల జాబితా నుంచి అర్హులైన రైతుల భూములను తొలగించాలి.

4.దీర్ఘకాలంగా సాగులో ఉన్న రైతులకు పట్టాలు మంజూరు చేయాలి.

5.అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.


6.ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలి.

7.ఇళ్ల నిర్మాణానికి లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలి.

ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్, ఏఐయుకెఎంఎస్ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు బి.కిషన్, ప్రధాన కార్యదర్శి ఆర్.దామోదర్, జిల్లా అధ్యక్షులు ఎస్.సురేష్, సీపీఐ ఏంఎల్ మాస్ లైన్ మోర్తాడ్ మండల కార్యదర్శి జి.కిషన్, బీంగల్ మండల కార్యదర్శి కె రాజేశ్వర్, ఏఐయుకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జీ.నడిపి నర్సయ్య, యు.రాజన్న, డివిజన్ కోశాధికారి ఇ.రమేష్, నాయకులు సి.పోశన్న, టి.గంగాధర్, పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏం.నరేందర్, ఆర్మూర్ ఏరియా అధ్యక్షులు నిఖిల్, రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, ప్రజా సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు సుమారు 800 మంది పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- ఫిర్యాదుదారుల సమస్యలను నేరుగా విన్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్



విశాల భారతి,మెదక్ ప్రతినిధి : ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి, ఆయా సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, విచారణ పురోగతిని బాధితులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు.ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఎస్పీ సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

ఆచార్య సందిరి బాలయ్య గంగపుత్ర జయంతి ఉత్సవాలకు ఆహ్వానం

- రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యకు ఆహ్వాన పత్రిక అందజేత



విశాల భారతి, హైదరాబాద్: గంగపుత్ర జాతిపిత, మత్స్యకార మహాత్మ ఆచార్య సందిరి బాలయ్య గంగపుత్ర 115వ జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యకు ఆహ్వాన పత్రిక అందజేశారు. గంగపుత్ర చైతన్య సమితి-తెలంగాణ ప్రతినిధులు ఆయనను కలిసి జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా గంగపుత్ర మహాత్మ ఆచార్య సందిరి బాలయ్య గంగపుత్ర సేవలను స్మరించుకుంటూ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. గంగపుత్ర సామాజిక వర్గ ఐక్యత, అభ్యున్నతి, హక్కుల సాధనకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, బీసీ జాక్ స్టేట్ కోఆర్డినేటర్ గుజ్జ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి



రాజేంద్రనగర్, విశాల భారతి : మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీగూడలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎనిమిదేళ్ల బాలుడు ఇంట్లో అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెందడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం ఆదివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో మహిళా బిల్డింగ్ వెనుక ఉన్న ఓ నివాసంలో ఈ ఘటన జరిగింది. బాలుడి తల్లిదండ్రులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతాప్‌గఢ్ జిల్లాకు చెందిన వలస కార్మికులుగా పోలీసులు గుర్తించారు. తండ్రి కాటేదాన్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తుండగా, తల్లిదండ్రులు తమ పనుల నిమిత్తం బయటకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఘటన జరిగిన సమయంలో బాలుడి ఐదేళ్ల చెల్లెలు కూడా ఇంట్లోనే ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే ఇంటికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడి మృతికి గల కారణాలు ఏమిటి? ఘటన జరిగిన సమయంలో అసలు ఏం జరిగింది? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



విశాల భారతి, భూపాలపల్లి ప్రతినిధి : ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులతో కలిసి 'చూస్ లైఫ్, నో టొబాకో' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతను పొగాకు వ్యసనాల నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా 'టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 4.0' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలతో పాటు యువత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పొగాకు వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గుట్కా, ఖైనీ, జర్దా, సిగరెట్లు తదితర పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లాలోని విద్యాసంస్థల్లో పొగాకు రహిత విద్యాసంస్థల మార్గదర్శకాలను అమలు చేయడంతో పాటు, విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నియంత్రించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (ఎన్.టి.సి.పి) ద్వారా దేశవ్యాప్తంగా అక్టోబర్ 28 నుంచి డిసెంబర్ 26, 2026 వరకు 60 రోజుల పాటు ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



మమితా బైజు అసలు పేరు నమితనా?

సినిమా పరిశ్రమలో కొందరు నటీనటులు తమ సహజమైన నటనతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటారు. అలాంటి వారిలో యువ నటి మమితా బైజు ఒకరు. 'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరైన ఈ మలయాళ భామ ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. అయితే ఆమెకు మమితా అనే పేరు ఎలా వచ్చిందో తెలుసా? తన అసలు పేరు వెనుక ఉన్న ఆసక్తికరమైన విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్వయంగా వెల్లడించింది. మమితా బైజు పుట్టినప్పుడు ఆమె తల్లిదండ్రులు ఎంతో ఇష్టంగా 'నమిత' అనే పేరును నిర్ణయించారట. అయితే జనన ధ్రువీకరణ పత్రం నమోదు చేసే సమయంలో జరిగిన చిన్న పొరపాటు కారణంగా నమిత పేరు కాస్తా మమితగా మారిపోయింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు వెంటనే గుర్తించలేకపోయారు. దాదాపు నాలుగైదేళ్ల తర్వాత పాఠశాలలో చేర్పించే సమయంలో ధ్రువీకరణ పత్రాలను పరిశీలించగా అసలు విషయం బయటపడిందట.అప్పటికే అధికారిక పత్రాల్లో మమిత అనే పేరు నమోదై ఉండటంతో దాన్ని మార్చడం సాధ్యం కాలేదు. దీంతో తల్లిదండ్రులు మొదట అనుకున్న పేరుకు బదులుగా మమిత అనే పేరునే కొనసాగించాల్సి వచ్చింది. అలా ఒక చిన్న పొరపాటుతో ఆమె పేరు మారిపోయింది. ఇప్పుడు అదే పేరు సినీ ప్రేక్షకులకు ఎంతో పరిచయమైన పేరుగా మారింది. 2024లో విడుదలైన మలయాళ చిత్రం 'ప్రేమలు' మమితా బైజు కెరీర్‌ను మలుపు తిప్పింది. ఈ సినిమాలో ఆమె నటన, సహజమైన హావభావాలు యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో ఒక్కసారిగా ఆమెకు దక్షిణాదిలో మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంటూ తనకంటూ ప్రత్యేక అభిమాన గణాన్ని సంపాదించుకుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.